ఫైనల్‌లో తరుణ్ మన్నెపల్లి

కజకిస్తాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్

అస్తానా: కజకిస్తాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్‌లో భారత షట్లర్ల జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. సెమీస్‌లో తరుణ్.. 21-8, 21-7 తేడాతో వియాత్నాంకు చెందిన లి డుసి ఫట్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ 24-22, 21-16 తేడాతో జపాన్ క్రీడాకారిణి సొరనొ యోషికవాను ఓడించింది. ఫైనల్‌లో ఆమె భారత్‌కే చెందిన ఇషారాణితో తలపడుతుంది.

ఐపీఎల్ మ్యాచ్‌లకు నీళ్లెక్కడివి..?

- కేఎస్‌సీఏ నుంచి నివేదిక కోరిన ఎన్జీటీ

బెంగళూరు : కర్నాటక రాజధాని బెంగళూరులో జనం ఒకవైపు తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతుండగా నగరంలోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్జీటీ) స్పందించింది. ఒక్కో మ్యాచ్‌కు వేలాది లీటర్ల నీరు అవసరమవుతున్న నేపథ్యంలో అంత నీటిని ఎక్కడ్నుంచి తీసుకొస్తున్నారని కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌తో పాటు బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, కర్నాటక స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులను ప్రశ్నించింది. చిన్నస్వామిలో మ్యాచ్‌ల నిర్వహణకు ఎంత నీటిని వాడుతున్నారు..? వాటిని ఎక్కడ్నుంచి తీసుకొస్తున్నారు..? వంటి వివరాలను తమకు మే 2 లోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది.

సెమీస్‌లో బాలాజీ, బిజెమన్

హోస్టన్: అమెరికాలోని హోస్టన్ నగరం వేదికగా జరుగుతున్న యూఎస్ మెన్స్ క్లే కోర్టు చాంపియన్‌షిప్స్‌లో భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ, జర్మన్ సహచరుడు ఆండ్రె బిజెమన్‌ల ద్వయం సెమీస్‌కు చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల క్వార్టర్స్‌లో ఈ అన్‌సీడెడ్ ఇండో-జర్మన్ జోడీ.. 6-0, 6-3 తేడాతో భారత్‌కే చెందిన అర్జున్ - జీవన్‌లను ఓడించింది.

మార్క్‌రమ్ (50)

రైజర్స్ రయ్‌రయ్..

- చెన్నైపై ఘన విజయం
- రాణించిన మార్క్‌రమ్, అభిషేక్
- ధోనీకి అభిమానుల అపూర్వ మద్దతు

స్టేడియం హాజరు 35,904 మంది

సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) సొంతగడ్డపై దుమ్మురేపింది. ఉప్పల్ స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్‌కే)ను చిత్తు చేస్తూ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత తమ సూపర్ బౌలింగ్‌తో చెన్నైని స్వల్ప స్కోరుకు కట్టడి చేసిన రైజర్స్..బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. ఓపెనర్ అభిషేక్‌శర్మ సుడిగాలి ఇన్నింగ్స్‌తో అదిరిపోయే ఆరంభాన్ని ఇస్తే..మార్క్‌రమ్ సాధికారిక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమయ్యాడు. మొత్తంగా సొంత ఇలాకాలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. తమ అభిమాన క్రికెటర్ ధోనీని చూసేందుకు ఉప్పల్ స్టేడియానికి ప్రేక్షకులు భారీ సంఖ్యలో పోటెత్తారు.

అభిషేక్‌శర్మ (37)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆకట్టుకుంది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత శివమ్‌దూబే(24 బంతుల్లో 45, 2 ఫోర్లు, 4సిక్స్‌లు), రహానే(35) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 165-5 స్కోరు చేసింది. భువనేశ్వర్, నటరాజన్, కమిన్స్, షాబాజ్, ఉనద్కత్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో హైదరాబాద్..18.1 ఓవర్లలో 166-4 స్కోరు చేసింది. మార్క్‌రమ్(36 బంతుల్లో 50, 4ఫోర్లు, సిక్స్), అభిషేక్‌శర్మ(12 బంతుల్లో 37, 3ఫోర్లు, 4సిక్స్‌లు) విజృంభించారు. అలీ(2-23) రెండు వికెట్లు తీయగా, చాహర్, తీక్షణ ఒక్కో వికెట్ పడగొట్టారు. అభిషేక్‌శర్మకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

రైజర్స్ ఆడుతూ పాడుతూ:

చెన్నై నిర్దేశించిన లక్ష్యఛేదనను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. పసలేని చెన్నై బౌలింగ్‌ను ఆది నుంచే ఆలవోకగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాగింది. చాహర్ తొలి ఓవర్ రెండో బంతికే ట్రావిస్ హెడ్..ఔట్ నుంచి తప్పించుకున్నాడు. స్లిప్‌లో మొయిన్ అలీ క్యాచ్ విడిచిపెట్టడంతో బతికిపోయాడు. రెండో ఓవర్‌కు వచ్చిన ముకేశ్ చౌదరిని అభిషేక్‌శర్మ చీల్చి చెండాడు. మూడు కండ్లు చెదిరే సిక్స్‌లతో తోడు రెండు ఫోర్లతో ఏకంగా 27 పరుగులు స్కోరుబోర్డుకు జతచేశాడు. చాహర్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో అదే దూకుడు కొనసాగించబోయిన అభిషేక్..జడేజా సూపర్‌క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో మొదటి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. శర్మ తర్వాత వచ్చిన మార్క్‌రమ్..హెడ్‌కు జతకలిశాడు. తుషార్ ఆరో ఓవర్లో మూడు ఫోర్లతో హైదరాబాద్ వికెట్ కోల్పోయి 78 పరుగులు చేసింది. ఈ క్రమంలో రైజర్స్ రెండో అత్యుత్తమ(78-1) పవర్‌ప్లే స్కోరును తమ ఖాతాలో వేసుకుంది. హెడ్, మార్క్‌రమ్ నింపాదిగా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. సాఫీగా సాగుతున్న క్రమంలో తీక్షణ 10వ ఓవర్లో హెడ్‌ను ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హైదరాబాద్ బ్యాటర్లను నిలువరించేందుకు చెన్నై కెప్టెన్ రుతురాజ్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది.

చెన్నై నెమ్మదిగా:

టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్..చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఢిల్లీతో గత మ్యాచ్ ఓటమి నుంచి ఇంకా పూర్తిగా తేరుకుని చెన్నై..తమ ఇన్నింగ్స్‌ను మందకోడిగా ప్రారంభించింది. దీనికి తోడు హైదరాబాద్ బౌలర్లు ఆది నుంచే తమదైన రీతిలో ఒత్తిడి పెంచుకుంటూ పోవడం కలిసి వచ్చింది. లీగ్‌లో మంచి ఫామ్ మీదున్న ఓపెనర్ రచిన్ రవీంద్ర, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(26) జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించలేకపోయారు. రహానేతో కలిసి శివమ్ దూబే..హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. షాబాజ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ భారీ సిక్స్‌తో పాటు ఫోర్ బాదాడు. ఓ ఎండ్‌లో దూబే బౌండరీలతో విజృంభిస్తే..మరో ఎండ్‌లో రహానే చక్కని సహకారం అందించాడు. జైదేవ్ ఉనద్కత్ పరుగులను నియంత్రించడం రైజర్స్‌కు కలిసొచ్చింది. అప్పటికే మంచి ఊపులోకి వచ్చి ప్రమాదకరంగా మారుతున్న దూబేను కమిన్స్ ఔట్ చేశాడు. ఐపీఎల్‌లో కమిన్స్‌కు ఇది 50వ వికెట్. దీంతో మూడో వికెట్‌కు 39 బంతుల్లో 65 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అప్పటికే పరుగుల రాక మందగించి ఒత్తిడిలో ఉన్న చెన్నై..ఉనద్కత్ బౌలింగ్‌లో రహానే వికెట్ కోల్పోవడంతో మరింత కష్టాల్లో పడింది. ఇదే అదనుగా హైదరాబాద్ తమ బౌలింగ్‌తో మరింత ఒత్తిడి పెంచడం కలిసొచ్చింది.

నితీశ్‌రెడ్డికి చాన్స్

ఈ సీజన్‌లో తెలుగు యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి రైజర్స్ అవకాశం ఇచ్చింది. 2024లో మంచి ఫామ్‌మీదున్న క్లాసెన్(10 నాటౌట్)తో కలిసి నితీశ్(14 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. దీపక్ చాహర్ 19వ ఓవర్లో తొలి బంతికే సిక్స్ కొట్టి నితీశ్..రైజర్స్‌కు సొంతగడ్డపై వరుసగా రెండో విజయాన్ని అందించాడు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	3	3	0	2.51	6
రాజస్థాన్	3	3	0	1.24	6
చెన్నై	4	2	2	+0.51	4
లక్నో	3	2	1	0.48	4
హైదరాబాద్	4	2	2	+0.40	4
పంజాబ్	4	2	2	-0.22	4
గుజరాత్	4	2	2	-0.58	4
బెంగళూరు	4	1	3	-0.87	2
ఢిల్లీ	4	1	3	-1.34	2
ముంబై	3	0	3	-1.42	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 165-5(దూబే 45, రహానే 35, భువనేశ్వర్ 1-28, జైదేవ్ 1-29),
హైదరాబాద్: 18.1 ఓవర్లో 166-4(మార్క్‌రమ్ 50, అభిషేక్ 37, అలీ 2-23, తీక్షణ 1-27)

ఐపీఎల్ ముచ్చట్లు

పసుపు రంగులో: ఉప్పల్ స్టేడియం పసుపు రంగు పులుముకుంది. తమ అభిమాన ఆటగాడు మహేంద్రసింగ్ ధోనీ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చిన ఫ్యాన్స్..చెన్నై జెర్సీలు ధరించి స్టేడియాన్ని హోరెత్తించారు. స్టాండ్స్‌లో ఎక్కడ చూసినా ఫ్యాన్స్ యెల్లో జెర్సీలతో నందడి నందడి చేశారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై మ్యాచ్‌ను వీక్షించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు స్టేడియానికి తరలివచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి పొన్నం ప్రభాకర్, పాటు సినీ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, వెంకటేశ్ బ్రహ్మానందం తదితరులు హాజరయ్యారు.

ధోనీ.. ధోనీ

ఇన్నింగ్స్ 20వ ఓవర్లో చెన్నై దిగ్గజ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ మైదానంలో అడుగుపెట్టాడు. ఈ సీజన్‌తో ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతాడని భావిస్తున్న నేపథ్యంలో మైదానంలో అడుగుపెట్టడమే ఆలస్యం..ఒక్కసారిగా అభిమానులు ధోనీ ధోనీ అంటూ అభిమానులు దిక్కులు పిక్కటిల్లేలా అరవడంతో స్టేడియం ఒక్కసారిగా ఊగిపోయింది.

ముంబైతో చేరిన సూర్య

ముంబై: టీ20లలో వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ క్యాంప్‌లో చేరాడు. స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ కారణంగా గతేడాది డిసెంబర్ నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్న మిస్టర్ 360.. శుక్రవారం ముంబై టీమ్‌తో కలిశాడు. అనంతరం అతడు వాంఖెడే స్టేడియంలో సహచర క్రికెటర్లతో కలిసి తనదైన ట్రేడ్ మార్క్ షాట్లు ఆడిన వీడియోను ఆ జట్టు ట్విటర్ (ఎక్స్) ఖాతాలో షేర్ చేసింది. ఇటీవలే ఎన్‌సీఏ నుంచి క్లీయరెన్స్ పొందిన సూర్య.. ఈ నెల 7న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగబోయే మ్యాచ్‌లో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రతిష్ఠాత్మక 15వ సీఐడీసీ విశ్వకర్మ అవార్డుల్లో ప్రెకా సంస్థ మరోసారి సత్తా చాటింది. బెస్ట్ ప్రి-ఇంజినీర్డ్ బిల్డింగ్‌కుగాను అవార్డును అందుకుంటున్న ప్రెకా ప్రతినిధులు శ్రీధర్, చేతన్, సోనూనె, కృష్ణవంశీ

వాణిజ్య

యూపీఐతో నగదు డిపాజిట్

త్వరలో బ్యాంకు సీడీఎంల్లో సదుపాయం
ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం
వరుసగా ఏడోసారీ కీలక వడ్డీరేట్లు యథాతథం
ఆగస్టు నుంచి తగ్గుతాయన్న అంచనాలు

ముంబై, ఏప్రిల్ 5: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) అప్లికేషన్ల (యాప్స్)కు మరింత కిక్కిచ్చే నిర్ణయం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను చేపట్టిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ క్రమంలోనే ఎంతో ప్రజాదరణ పొందిన యూపీఐ వినియోగం ద్వారా బ్యాంకుల్లో నగదు డిపాజిట్లకు వీలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన విధివిధానాలను తీసుకొస్తామని చెప్పారు. ఈ సదుపాయం గనుక అందుబాటులోకి వస్తే మొబైల్ ఫోన్ యూజర్లకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువవైనట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రస్తుతం డెబిట్ కార్డులతోనే బ్యాంకులు, ఏటీఎం సెంటర్లలో ఉన్న క్యాష్ డిపాజిట్ మెషీన్ల (సీడీఎం) ద్వారా ఖాతాల్లో నగదును జమ చేసుకునే సౌకర్యం ఖాతాదారులకున్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు యూపీఐతో సీడీఎంల్లో నగదు డిపాజిట్ సదుపాయాన్ని తెచ్చేందుకు ఆర్బీఐ నిర్ణయించింది.

ఆర్బీఐ ద్రవ్యసమీక్ష ముఖ్యాంశాలు

- ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను దేశ జీడీపీ వృద్ధి అంచనా 7 శాతమే. గత ఆర్థిక సంవత్సరం (2023-24) అంచనా 7.6 శాతం.
- రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా నమోదు కావచ్చు. సాధారణ వర్షపాతంతో ధరలు అదుపులోనే. అయితే భౌగోళిక, రాజకీయ ఆందోళనలతో ధరలకు రెక్కలు.
- ఐఎఫ్‌ఎస్‌సీ గుజరాత్‌లో సావరిన్ గ్రీన్ బాండ్ల ట్రేడింగ్, పెట్టుబడులకు అనుమతి.
- తగ్గిన సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లావాదేవీలు, పెరిగిన పీ2ఎం (పీర్ టు మర్చంట్స్) లావాదేవీలు. సీబీడీసీ వ్యాలెట్ సేవలను అందించేందుకు బ్యాంకింగేతర పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లకు అనుమతి.
- గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) ద్వారా 41.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాక. 2014-15 తర్వాత ఇదే గరిష్ఠం.
- ప్రపంచ దేశాల్లో రెమిటెన్సులను ఎక్కువగా అందుకుంటున్న ది భారత్.
- తదుపరి ద్రవ్యసమీక్ష జూన్ 5-7.

పసిడి నిల్వలు పైపైకి..

దేశంలో బంగారం నిల్వల్ని పెంచుకుంటూపోతున్నామని ఆర్బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. ఫారెక్స్ రిజర్వుల బలోపేతంలో భాగంగానే ఇదంతా అన్నారు. అయితే ఏ స్థాయిలో బంగారాన్ని కొంటున్నారో ఆ వివరాలను మాత్రం చెప్పలేదు. అయినప్పటికీ క్రమేణా పసిడి నిల్వల్ని పెంచుతున్నామని మాత్రం చెప్పారు. ఇదిలావుంటే ఈ ఏడాది మార్చి 29 నాటికి దేశీయ ఫారెక్స్ రిజర్వుల్లో బంగారం వాటా 52.16 బిలియన్ డాలర్లుగా ఉన్నది. గత ఏడాది మార్చి ఆఖరుతో పోల్చితే గోల్డ్ రిజర్వుల విలువ దాదాపు 7 బిలియన్ డాలర్లు పెరిగింది. కాగా, ఈ ఏడాది జనవరిలో ఆర్బీఐ 8.7 టన్నుల పుత్తడిని కొన్నట్టు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. గడిచిన రెండేండ్లలో ఇదే గరిష్ఠం. ఈ జనవరి చివరి నాటికి ఆర్బీఐ వద్ద 812.3 టన్నుల బంగారు నిల్వలున్నాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) లెక్కలతో తెలుస్తున్నది. గత నెల 29 నాటికి దేశీయ ఫారెక్స్ రిజర్వులు ఆల్‌టైమ్ హైని తాకుతూ 645.58 బిలియన్ డాలర్లకు చేరాయి. వారం రోజుల్లోనే 2.95 బిలియన్ డాలర్లు పెరిగాయి.

దీనివల్ల కస్టమర్లకు మరింత సులువుగా పనై పోతుందన్న భావనను ఆర్బీఐ వెలిబుచ్చుతున్నది. ఇప్పటికే యూపీఐ ద్వారా కార్డ్-లెస్ క్యాష్ విత్‌డ్రాయల్స్ సౌకర్యం ఏటీఎంల్లో ఉన్నది తెలిసిందే.

పీపీఐ యూజర్లకు జోష్

వినియోగదారుల సౌకర్యార్థం థర్డ్-పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా ప్రీపెయిడ్ చెల్లింపు సాధనాల (పీపీఐ) అనుసంధానానికి అనుమతినివ్వాలని ఆర్బీఐ నిర్ణయించింది. ప్రస్తుతం స్మార్ట్ కార్డులు, ఆన్‌లైన్ అకౌంట్లు, ఆన్‌లైన్ వ్యాలెట్లు, స్ట్రిప్ కార్డులు, పేపర్ వోచర్లు వంటి పీపీఐల జారీదారులు కల్పించిన యాప్ వినియోగం ద్వారానే యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో బ్యాంక్ ఖాతాదారుల మాదిరే పీపీఐ యూజర్లూ యూపీఐ పేమెంట్స్‌ను సులువుగా చేసుకోగలరు. దీనికి సంబంధించిన విధివిధానాలు త్వరలోనే వెలువడుతాయని ఆర్బీఐ ఈ సందర్భంగా తెలిపింది. ప్రస్తుతం బ్యాంక్ ఖాతాల నుంచి యూపీఐ చెల్లింపులు సదరు యూపీఐ యాప్ (గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం మొదలగునవి) ఆ బ్యాంక్ ఖాతాతో లింకై ఉంటేనే జరుగుతున్నది విదితమే. అయితే ఈ సౌకర్యం పీపీఐలకు ఇప్పుడు లేదు. ఇకపై రానున్నది.

రిటైల్ ఇన్వెస్టర్ల కోసం యాప్

ప్రభుత్వ సెక్యూరిటీలు లేదా ప్రభుత్వ బాండ్ల మార్కెట్‌లో రిటైల్ మదుపరుల సౌకర్యార్థం ఓ మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్టు ఆర్బీఐ గవర్నర్ దాస్ వెల్లడించారు. 2021 నవంబర్‌లో ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీంను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి, ఆర్బీఐతో గిల్ట్ ఖాతాలను నిర్వహించడానికి వ్యక్తిగత మదుపరులకు ఇది వీలు కల్పించింది. నెగోషియేటెడ్ డీలింగ్ సిస్టమ్-ఆర్డర్ మ్యాచింగ్ సిస్టమ్ (ఎన్‌డీఎస్-ఓఎం) వేదిక ద్వారా సెక్యూరిటీల క్రయవిక్రయాలు, ప్రైమరీ వేలాల్లో బాండ్ల కొనుగోలుకు రిటైల్ ఇన్వెస్టర్లకు అవకాశమిచ్చింది. ఈ క్రమంలో రిటైల్ ఇన్వెస్టర్లకు మరింత సౌకర్యంగా ఉండేలా రిటైల్ డైరెక్ట్ పోర్టల్‌కు చెందిన మొబైల్ యాప్‌ను సిద్ధం చేశామని గవర్నర్ దాస్ తెలియజేశారు. త్వరలోనే ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ ప్రభుత్వ బాండ్లను కేంద్రం తరపున ఆర్బీఐనే జారీ చేస్తుందన్న సంగతి విదితమే.

కీలక వడ్డీరేట్లు యథాతథం

వరుసగా ఏడోసారీ కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచింది. రెపోరేటు 6.5 శాతంగానే ఉన్నది. ఇది తగ్గితే వాహన, గృహ, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలకు ఈఎంఐల భారం దిగి ఊరట దక్కేది. తాజా ద్రవ్యసమీక్షలో పాల్గొన్న ఆరుగురు సభ్యుల్లో రెపోరేటు జోలికి వెళ్లవద్దని ఐదుగురు సభ్యులు ఓటేశారు. కాగా, ఆగస్టు నుంచి వడ్డీరేట్లు తగ్గొచ్చన్న అంచనాలు ఉన్నాయి.

ఈ ఎండాకాలంలో కూరగాయల ధరల కదలికల్ని పరిశీలించాల్సిన అవసరం మాకున్నది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలన్నదే మా లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ఆహార ద్రవ్యోల్బణం అదుపు చాలా కీలకం. కానీ జూన్ దాకా వడగాలుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ చెప్తున్నది. మొత్తానికి సాధారణ వర్షపాతం ఈసారి ఉంటుందనే ఆశిస్తున్నాం. అదే జరిగితే పంట దిగుబడులు బాగుంటాయి. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. అయితే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం కూడా ఉంటున్నది. చమురు ధరలూ కీలకమే.

-శక్తికాంత దాస్, ఆర్బీఐ గవర్నర్

హైదరాబాద్‌లో మివీ మరో ప్లాంట్

200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న యూనిట్‌కు భూమిపూజ

హైదరాబాద్, ఏప్రిల్ 5: ఆడియో ఎలక్ట్రానిక్స్ సంస్థ మివీ (ఆవిశ్కరణ్ ఇండస్ట్రీస్).. హైదరాబాద్‌లోని తుక్కుగూడ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ఉత్పత్తి కేంద్రానికి శుక్రవారం భూమిపూజ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్, సీఎంవో మిధుల దేవభక్తుని మాట్లాడుతూ.. ఏడు ఎకరాల స్థలంలో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి రానున్నున్నట్లు, తద్వారా మరో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటికే శంషాబాద్‌లో ఉన్న యూనిట్‌ను భవిష్యత్తులో ఇక్కడికి తరలించే ప్రతిపాదన కూడా ఉన్నదన్నారు. వచ్చే ఐదేండ్లలో రూ.200 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించిన ఆమె..ఇందుకోసం కొత్తగా మరో మూడు విభాగాల్లోకి ప్రవేశించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఐవోటీ పరికరాలు, కెమెరా, టీవీల విభాగాల్లో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఈ యూనిట్‌లోనే ఉత్పత్తులను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ప్లాంట్లో డ్రైవెన్, పీసీబీఏ, బ్యాటరీలతోపాటు ఆడియో ఉత్పత్తులు, ఇయర్‌ఫోన్లు, సౌండ్‌బార్లు, స్పీకర్లు, గేమింగ్ యాక్ససరీస్‌లు తయారుకానున్నాయన్నారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో ఆన్‌లైన్ వాటా 90 శాతం కాగా, ఆఫ్‌లైన్ వాటా 10 శాతంగా ఉన్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.999 మొదలుకొని రూ.16 వేల లోపు ధర కలిగిన పలు ఉత్పత్తులను విక్రయిస్తున్నది.

బిగ్‌సి ఉగాది పండుగ ఆఫర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 5:ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్‌'సి'..ఉగాది పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మొబైళ్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలుపై ఆకర్షణీయమైన వినూత్న ఆఫర్లు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. మొబైల్స్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీల కొనుగోలుపై 7.5 శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్, ఏడాదిపాటు మొబైల్ ప్రొటెక్షన్, రెండో ఏడాది రూ.8 వేల వరకు విలువకలిగిన మొబైల్ ప్రొటెక్షన్‌ను అదనంగా పొందవచ్చునని తెలిపారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతితోపాటు వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా సులభ వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే అవకాశం కూడా సంస్థ కల్పించింది. వీటితోపాటు బ్రాండెడ్ యాక్ససరీస్‌పై 51 శాతం డిస్కౌంట్, ఐఫోన్లపై రూ.39 వేల వరకు ప్రయోజనాలు, సామ్‌సంగ్ మొబైళ్లపై రూ.10 వేల వరకు క్యాష్ బ్యాక్, వివో మొబైళ్లపై రూ.7 వేల వరకు, ఒప్పో మొబైళ్లపై 10 శాతం వరకు క్యాష్ బ్యాక్, రియల్‌మీ మొబైళ్లపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్, 32 అంగుళాల టీవీని రూ.9,999కే అందిస్తున్నది.

టీ హబ్‌లో రెనో-నిస్సాన్ ఓపెన్ చాలెంజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రంగాల్లో ఆవిష్కరణలను నిర్వహిస్తున్న టీహబ్... తాజాగా ఆటో మొబైల్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రెనో- నిస్సాన్‌తో కలిసి ఓపెన్ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నది. ప్రారంభ దశలో ఉన్న ఆటోమొబైల్ స్టార్టప్‌లతో పాటు కొత్తగా వాహన తయారీకి సంబంధించిన వినూత్న ఆలోచనలు ఉన్న వారు రెనో-నిస్సాన్‌తో కలిసి ఓపెన్ ఇన్నోవేషన్ చాలెంజ్‌లో పాల్గొనవచ్చని టీ హబ్ నిర్వాహకులు తెలిపారు. జనరేటివ్ ఏఐ పరిజ్ఞానంతో వెహికిల్ డిజైన్ డెవలప్‌మెంట్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ఎనలిటిక్స్, కన్వర్జేషనల్ ఏఐ వంటి సాంకేతిక అంశాలతో ఆటో మొబైల్ రంగంలో ఆవిష్కరణలు చేసేందుకు ఈ ఓపెన్ ఇన్నోవేషన్ చాలెంజ్ దోహదం చేస్తుందని, వివరాలకు (https://bit.ly/3TlSTnn)లో సంప్రదించాలని సూచించింది.

అరబిందో యూనిట్‌పై అమెరికా అభ్యంతరాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మా యూనిట్‌పై అమెరికా అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కంపెనీకి ఉన్న యూనిట్‌పై యూఎస్ ఫుడ్ అండ్